క్లుప్తంగా

నేడు నాటకరంగ దినోత్సవ కార్యక్రమం

కడప కల్చరల్ : ప్రపంచ నాటక రంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక శ్రీ వెంకటేశ్వర సాంస్కృతిక కళామండలి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రలో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రంగ స్థల కళాకారులు ఎస్.మధుబాబు ఆధ్వర్యంలో తొలుత రంగస్థల పద్యాల ఆలాపన, అనంతరం నాటకాభిమానుల సమ్మేళనం, చివరగా రంగస్థల కళాకారులకు సత్కారాలు నిర్వహిస్తారు. కార్యక్రమానికి ప్రముఖులు, కళాపోషకులు లయన్ పి.ఖాసింఖాన్, లయన్ మానస చిన్నపరెడ్డి, వల్లూరు బ్రహ్మయ్య, మోరంరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, పల్లేటి లక్ష్మీకులశేఖర్ హాజరు కానున్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఫీజుల వసూళ్లు

వైవీయూ: విద్యార్థుల నుంచి అధిక పరీక్ష ఫీజులు వసూలు చేస్తున్న లా కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎం.ఆర్. నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని న్యాయకళాశాలలు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. రూ.10 నుంచి రూ.13 వేలు ఫీజులు కేటాయిస్తే కళాశాలల యాజమాన్యాలు ఇష్టానుసారంగా వసూలు చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సోనీ, దీప పాల్గొన్నారు.

రామ్‌చరణ్ అభిమానుల రక్తదానం



రక్తదానం చేస్తున్న అభిమానులు

కడప కల్చరల్ : కడప నగరంలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో ఆదివారం సినీ నటులు రామ్‌చరణ్‌తేజ్ అభిమానులు రక్తదానం చేశారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని జిల్లా చిరంజీవి యువత అధ్యక్షులు రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అతిథి దినేష్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. చిరంజీవి అభిమానులు చిన్నా, వెంకటసురేంద్ర, నాగేంద్ర, దేవకుమార్, రాజేష్, చంటి, జానీకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షానికి దెబ్బతిన్న నూగు పంట



మొలకెత్తిన నూగుపంట

వీరపునాయునిపల్లె : మండలంలోని తలపనూరు గ్రామంలో నూగు పంట శనివారం రాత్రి గాలీ వానకు పూర్తిగా దెబ్బనింది. తలపనూరు గ్రామానికి చెందిన 5 మంది రైతులకు చెందిన 20 ఎకరాల్లో సాగు చేసిన పంటను నూర్పిడి చేసేందుకు కుప్పలు వేసిన నూగు పంట పూర్తిగా దెబ్బతిని మొలకలు రావడం జరిగిందని రైతులు వాపోతున్నారు. దీంతో దాదాపు రూ.60 లక్షలు నష్టపోయామన్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు.

మోటారు వాహనాలకు వేలం

వీరపునాయునిపల్లె : స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుబడిన మోటారు వాహనాలను ఈ నెల 31వ తేదీ ఉదయం 10 గంటలకు బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ రాజారమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. వేలం పాటలో పాల్గొను వారు తమ వెంట ఆధార్ కార్డులు తీసుకుని రావాలని ఆయన కోరారు.

పోలవరం ఎత్తును కుదించొద్దు

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రజలకు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు ఎత్తును కుదించొద్దని సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బి.రామయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఓ ప్రైవేటు పాఠశాలలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పోలవరం ఎత్తును కుదిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నించకపోవడం సరికాదన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును తగ్గించడం వల్ల రాయలసీమ ప్రాంతంలో సాగునీటి సమస్య ఏర్పడుతుందని తెలిపారు. గతంలో అనుమతించిన మేరకు ప్రాజెక్టు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. ఈ విషయమై ఈనెల 27, 28 తేదీల్లో కలెక్టరేట్ వద్ద దీక్షలు నిర్వహిస్తున్నామని, రైతులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి షరీఫ్, సభ్యులు యేసోబ్, చంద్రశేఖర్, ప్రతాప్, శ్రీను, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో రాష్ట్రం దేశానికే ఆదర్శం

- ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా
- సీఎంఆర్ఎఫ్ కింద రూ.18.28 లక్షల పంపిణీ



చెక్కులు అందుకున్న వారితో ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప సెవెన్‌రోడ్స్: పేదలకు వైద్య సేవలు కల్పించడంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా అన్నారు. ఆదివారం తన కార్యాలయంలో కడప నియోజకవర్గానికి చెందిన నలుగురు వ్యక్తులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 18.28 లక్షల చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇందులో ఒకరికి 8 లక్షల 33 వేలు, మరొకరికి రూ. 8 లక్షలు, ఇంకో వ్యక్తికి రూ. 1.20 లక్షలు, మరో వ్యక్తికి రూ. 75 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజద్ బాషా మాట్లాడుతూ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని తర్వాత వచ్చిన పాలకులు నీరుగార్చారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఆ పథకాన్ని బలోపేతం చేశారన్నారు. సుమారు 3400 వ్యాధులను ఆరోగ్యశ్రీ పరిధిలోకి చేర్చారన్నారు. వైద్య ఖర్చులు రూ. 1000 దాటితే ప్రభుత్వమే భరిస్తుందన్నారు. హైదరాబాదు, చెన్నై, బెంగుళూరులోని రెఫరల్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు ఆరోగ్యశ్రీ కింద పొందేందుకు అవకాశం కల్పించామన్నారు. సీఎంఆర్ఎఫ్ కింద వందలాది మందికి కోట్లాది రూపాయలు పంపిణీ చేశామన్నారు. గతంలో కేన్సర్ రోగులకు రూ. 2 లక్షల వరకు మాత్రమే ఇచ్చేవారని, ఇప్పుడు పూర్తి ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందన్నారు. కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్‌కు కూడా ప్రభుత్వం ఖర్చు పెడుతోందన్నారు. గ్రీన్ ఛానల్ ద్వారా బిల్లులు ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నామని వివరించారు. రోగికి ఓవైపు వైద్య సేవలు అందిస్తూనే కుటుంబ పోషణకు ప్రతినెలా రూ. 5 వేలు అందజేస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలు ఆశీస్సులు అందజేయాలని కోరారు.

దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా చరిత్రాత్మకం

హర్షం వ్యక్తం చేసిన ఏపీ బిషప్ కౌన్సిల్

కడప రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాసనసభలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టడం, ఆ బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం లభించడం అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ బిషప్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు బిషప్ డేనియల్ తెలిపారు. ఆదివారం స్థానిక వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ ఒక ఎస్సీ కుటుంబంలో ఇద్దరు బిడ్డలు ఉంటే అదే మతంలో ఒకరు ఉండి మరొక సంతానం క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే ఆ వ్యక్తికి రిజర్వేషన్‌తోపాటు ఇతర రాయితీలు వర్తించవని కొంతమంది వ్యాఖ్యానించడం ఆందోళన కలిగించిందన్నారు. కాగా, కులం పుట్టుకతో వస్తుందన్నారు. మతం మధ్యలో వస్తుందని తెలిపారు. దేశ చరిత్రలోనే ఈ అంశాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గమనించడం హర్షణీయమన్నారు. ఈ నేపథ్యంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పిస్తూ బిల్లును ప్రవేశపెట్టడం చారిత్రాత్మక ఘట్టంగా అభివర్ణించారు. దళిత క్రైస్తవులు ముఖ్యమంత్రికి రుణపడి ఉంటారని తెలిపారు. ఆ కౌన్సిల్ సభ్యులు రాజ్‌కుమార్, దేవన్న, ఫిలిఫ్స్, శ్యామూల్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

పురపాలక విద్య ముసాయిదా రూల్స్‌ను సవరించాలి

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వం ప్రతిపాదించిన మున్సిపల్ ఎడ్యుకేషన్ సర్వీస్ యూనిఫైడ్ డ్రాఫ్ట్ రూల్స్ చాలా లోపభూయిష్టంగా ఉన్నాయని వాటిని సవరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర మున్సిపల్ కమిటీ కన్వీనర్ రవిశంకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం కడప ఎస్టీయూభవన్‌లో మున్సిపల్ ఎడ్యుకేషనల సర్వీస్ యూనిఫైడ్ డ్రాపు రూల్స్‌పై ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ టీచర్ల ఉమ్మడి సర్వీసు రూల్స్‌కు జిల్లాలోని కార్పొరేషన్ ఒక యూనిట్‌గా, మున్సిపాలిటి ఒక యూనిట్‌గా పరిగణించాలన్నారు.మున్సిపాలిటీలలో అర్బన్ ఎంఈఓ పోస్టులను, అర్బన్ డీవైఈవో పోస్టులను మంజూరు చేసి ఆయా మున్సిపాలిటిలలోను, కార్పొరేషన్లలోనూ సీనియారిటి,రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటిస్తూ పురపాలక ఉపాధ్యాయులతోనే భర్తీ చేయాలన్నారు. వీటన్నింటిని ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక కార్యదర్శి మహబూబ్‌బాష, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి పద్మాకర్, నగర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సాదిక్‌ఆలీ, సజీవరాయుడు, ఎస్టీయూ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గ ఎంపిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న ఏపీటీఎఫ్ నూతన కమిటీ నాయకులు

కడప ఎడ్యుకేషన్: కడపజిల్లా ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (ఏపీటీఎఫ్–1938) నూతన కార్యవర్గాన్ని ఆదివారం కడపలోని ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో ఎన్నుకున్నారు. ఇందులో జిల్లా నూతన అధ్యక్షుడిగా వెంకటేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వీవీ రామాంజనేయులరెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా సాయి శివారెడ్డి, అసోసియేషన్ అధ్యక్షుడిగా బత్తలరాజు, ఉపాధ్యక్షుడిగా చంద్ర శేఖర్‌రెడ్డి, ఖాశీంపల్లి, నాగభూషణం, నారాయణ స్వామి ఎన్నికయ్యారు. వీరితో పాటు పలువురిని కార్యదర్శులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్వర్ రెడ్డి, వీరాంజులరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

గడువు ముగియకముందే కొత్త కమిటీనా!



జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి శేఖర్

కడప ఎడ్యుకేషన్: ఏపీటీఎఫ్‌కు సంబంధించి 2022 ఏప్రిల్‌లో ఎన్నుకున్న కమిటీ 2024 వరకు కొనసాగుతుందని ఏపీటీఎఫ్ రాష్ట్రకార్యదర్శి శేఖర్ అన్నారు. ఆదివారం ఏపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కడపజిల్లా సబ్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ఇష్టానుసారంగా నిబంధనావలి తుంగలో తొక్కి ఏపీటీఎఫ్‌ను గందరగోళంగా మార్చుతున్నారన్నారు. పాత కమిటీ ఉండగానే ఆదివారం మరో కమిటీని ఎన్నుకోవడం చూస్తే రాజకీయ పార్టీని తలపిస్తోందన్నారు. ఈ నూతన కమిటీ చెల్లదన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ మాట్లాడుతూ కక్ష్య సాధింపు ధోరణిలో రాష్ట్రశాఖ వ్యవహరిస్తుందన్నారు. వచ్చే నెల 2వ తేదీన జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సబ్ కమిటీ సభ్యులు ఈశ్వర చంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, పద్మజ, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్



ఇఫ్తార్ ప్రార్థనలు నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం, వైఎస్సార్ సీపీ మైనార్టీ నేతలు



ఇఫ్తార్‌లో పాల్గొన్న ముస్లింలు

ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కల్చరల్ : పవిత్ర రంజాన్ మాసంలో ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని కోరుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష ఆకాంక్షించారు. ఆదివారం కడప నగరంలోని అమీన్‌పీర్ దర్గా ఆవరణలో షేక్ నవీన్‌తాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కులమతాలకు అతీతంగా కడప నగరం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిందన్నారు. ఇఫ్తార్‌లకు అందరినీ ఆహ్వానించి అందరం ఒక్కటని సోదరభావంతో మెలగాలన్న ఆకాంక్ష కనిపిస్తోందన్నారు. సర్వమతాల సారం ఒక్కటేనని, ఉపవాస దీక్షలు, ఆరాధన ప్రార్థనలు మనుషుల్లో ప్రేమ, సోదరభావం మానవుల్లో సద్గుణాలను పెంపొందించడమే రంజాన్ మాస ముఖ్య ఉద్దేశమన్నారు. ముస్లింలు ఎంతో నిష్ఠగా ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ అల్లాహ్ మన్ననలు పొందాలని సూచించారు. పవిత్ర రంజాన్ మాసాన్ని గుర్తించి అల్లాహ్ మార్గంలో నడవాలన్నారు. తొలుత రంజాన్ మాసం మూడవరోజు ప్రార్థనలు నిర్వహించి ఉపవాస దీక్షను విరమించారు. అంతకుముందు ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష పెద్దదర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లిం ప్రముఖులు గౌసులాజం, ఇబ్రహీం మియా, అఫ్జల్‌ఖాన్, డాక్టర్ సొహైల్ అహ్మద్, మహమ్మద్ షఫీ, ఎస్ఆర్ఐ బీహెచ్ ఇలియాస్, అజ్మతుల్లాఖాన్, గోవర్ధన్‌రెడ్డి, నజీర్ అహ్మద్, హరిప్రసాద్, సలావుద్దీన్, ఆడిటర్ సయ్యద్ అహ్మద్, సయ్యద్ ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

రంగస్థల కళలను ఆదరించాలి



కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : ఎన్నో వందల సంవత్సరాల చరిత్ర కలిగిన రంగస్థల కళలు అంతరించిపోకుండా ప్రతిఒక్కరూ ఆదరించాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా ఆలిండియా కళారంగం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మైదుకూరురోడ్డులోని టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటకమనేది సమాజంలోని సమస్యలను ప్రతిబింబిస్తూ వారిలో చైతన్యాన్ని కలిగించే ప్రచార సాధనం వంటిదన్నారు. ఆంధ్రప్రదేశ్ నాటక అకాడమి డైరెక్టర్ బండారు లక్ష్మీదేవిసూర్యనారాయణ మాట్లాడుతూ ముఖ్యంగా నేటి యువతరానికి, సమాజానికి సందేశాత్మకమైన సమాచారాన్ని చేరవేయడానికి ఇటువంటి కళలను ప్రజల్లోకి వెళ్ళేలా చూడాలని కోరారు. అనంతరం ముఖ్యఅతిథులను సన్మానించడంతో పాటు కళాకారులకు గుర్తింపు కార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ హెచ్.వెంకటసుబ్బయ్య, ఆలిండియా కళారంగం వ్యవస్థాపక అధ్యక్షులు మాడుగులసుధీర్, జిల్లా అధ్యక్షులు బద్వేలురవితేజ, ఉపాధ్యక్షులు పోలిరెడ్డి, చెంచురెడ్డి, సి.రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెండ్లిమర్రికి ఎమ్మెల్యే రాక

పెండ్లిమర్రి : వైఎస్సార్ ఆసరా సంబంధించి మూడో విడత లబ్ధిదారులకు మెగా చెక్కు పంపిణీ కార్యక్రమం సోమవారం పెండ్లిమర్రిలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అల్తాఫ్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి హాజరవుతారని కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరుకావాలని ఆయన కోరారు.

విందుకు హాజరైన ఎమ్మెల్యే

వీరపునాయునిపల్లె : మండలంలోని బుసిరెడ్డిపల్లె గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన విందుకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్ రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, గడ్డంవారిపల్లె సహకార సంఘం అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న ఆర్ట్స్ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

వైవీయూ : ప్రతి ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని సంరక్షించాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. వై. సావిత్రి సూచించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపులో భాగంగా కడప నగరం శివానందపురంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో..

నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నగరపరిధిలోని పక్కీరుపల్లెలో ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంపు రెండోరోజు ఆదివారం కొనసాగింది. ఈ కార్యక్రమానికి వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. వెంకట్రామిరెడ్డి, మానవత సంస్థ ప్రతినిధి రామాంజునేయులరెడ్డి ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు మార్గనిర్దేశం చేశారు. ఎన్ఎస్ఎస్ పీఓ సుబ్బనరసయ్య, వలంటీర్లు పాల్గొన్నారు.

గంగమ్మ జాతరకు పోటెత్తిన భక్తజనం



అలంకరణలో గంగమ్మతల్లి

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట–బుగ్గలేటిపల్లి సమీపంలో వెలసిన గంగమ్మ జాతరకు భక్తజనం పోటెత్తారు. ఆదివారం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి వివిధ పండ్లతో అమ్మవారిని ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జామున 3 గంటల నుంచి బారులు తీరారు. అలాగే ఆలయ ఆవరణలోని వీరభద్రస్వామి, అంజనేయస్వామి, సాయిబాబాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో సురేష్‌కుమార్ ఏర్పాట్లను చేశారు. ఎస్ఐ అరుణ్‌రెడ్డి బందోబస్తును ఏర్పాటు చేశారు.

గౌస్‌నగర్‌లో తీవ్రమైన తాగునీటి సమస్య

కడప కార్పొరేషన్: కడప నగరంలోని గౌస్ నగర్, గంజికుంట కాలనీల్లో తాగునీటి సమస్యలు తీవ్రంగా మారాయి. ఇక్కడ ఒక రోజు నీళ్లు వస్తే 4 రోజులు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రంతా నీటి కోసం పడిగాపులు గాయాల్సి వస్తోందన్నారు. పైగా రంజాన్ మాసం కావడంతో ఉపవాసాలు ఉంటూ అలసిపోతున్నామని స్థానిక మహిళలు వాపోతున్నారు. డీఈలు, ఏఈలు, ఫిట్టర్లు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రాత్రంతా జాగారం..

శనివారం అర్ధరాత్రి నీళ్లొస్తాయని సిబ్బంది తెలపడంతో తెల్లార్లు నీళ్లకోసం మోటార్లు ఆన్ ఆఫ్ చేస్తూ అలసిపోయామని.. తీరా ఆదివారం ఉదయం తెల్లవారుజామున పైపులైన్ పగిలిపోయిందని చావు కబురు చల్లగా చెప్పారని స్థానికులు వాపోయారు. ఇక్కడి నీటి సమస్యపై శనివారం జరిగిన బడ్జెట్ సమావేశంలో కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎండీ జహీర్ ప్రస్తావించిన విషయం విదితమే. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో ఏం జరుగుతోందో తెలుసుకుని సమస్యలు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

పాతకడప, దేవునికడపలోనూ ఇదే పరిస్థితి

పెన్నానది సమీపంలోని గండి వాటర్ వర్క్స్ నుంచి పైపులైన్ ద్వారా మోడమీదపల్లె, పాతకడప, దేవుని కడప ద్వారా కడపకు నీరు సరఫరా కావాల్సి ఉంది. పాత మున్సిపాలిటీ పరిధిలోని నకాష్, ఖలీల్ నగర్, బళ్లారిరోడ్డు, పెద్ద దర్గా బెల్లంమండీ, సాయిపేట తదితర ప్రాంతాల్లో ఈ నీరు సరఫరా కావాల్సి ఉంది. అయితే ఇక్కడ పైపులైన్లు పాతవి కావడం, నీరు సక్రమంగా సరఫరా కాకపోవడం వల్ల పదే పదే సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ ప్రాంతాల్లో ఎక్కువగా మైనార్టీ ప్రజలే ఉండటంతో రంజాన్ మాసంలో ఈ సమస్యపై ఈ ప్రాంత కార్పొరేటర్లు బడ్జెట్ సమావేశంలోనూ ప్రధానంగా ప్రస్తావించారు.

సామాజిక ఇతివృత్తాలతో 'సీమ' నాటకం



ఓబిలి వెంకటయ్యను సత్కరిస్తున్న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ప్రతినిధులు, సిబ్బంది

కడప కల్చరల్ : రాయలసీమలో నాటక రచయితలు సామాజిక ఇతి వృత్తాలను ప్రజలకు ఉపయోగపడేలా రాశారని యోగి వేమన విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పరిశోధక విద్యార్థి ఓబిలి వెంకటయ్య అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రంలో నెలనెల సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఆదివారం 118వ సదస్సు నిర్వహించారు. రాయలసీమ సాంఘిక నాటకాలు 1950–2000 వరకు అనే అంశంపై ఓబిలి వెంకటయ్య ప్రసంగించారు. రాయలసీమలో తొలి నాటకం వృద్ధి మూల సంవాదం అని దుర్భాక రాజశేఖర శతావధాని వడ్డీల వల్ల ప్రజలు పడుతున్న పాట్లను ఈ నాటకంలో చూపారన్నారు. 1952లో ఆచార్య జీరెడ్డి చెన్నారెడ్డి అయోగ్యుల పాలనలో ఇబ్బందులు, అధికారుల నిర్లక్ష్యంతో విద్య నాశనం కావడాన్ని నాటకాలుగా మలిచారన్నారు. 1953లో నిరుద్యోగ సమస్యపై విశ్వప్రసాద్ ఇదే నా లోకం అంటూ నాటకం ద్వారా ప్రశ్నించారన్నారు. 1956లో డాక్టర్ అంతటి నరసింహం అంటరానితనంపైన, కులంతార వివాహాలపైన నాటకాలు రాశారన్నారు. 1948–51లో వచ్చిన కరువు ఇతివృత్తంగా రామిరెడ్డి యల్లారెడ్డి కరువు నాటకం, 1958లో రా.రా. అన్నం పెట్టని చదువు. ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఏదీ గర్వకారణం, కర్మశీలి నాటకాలను సామాజిక అంశాలే ఇతి వృత్తాలుగా రాశారన్నారు. ఈ ఒరవడిని కొనసాగిస్తూ పలువురు ప్రముఖ కవులు, రచయితలెందరో సామాజిక అంశాలపై నాటకాలను వెలువరించారన్నారు. వారిలో కొలకలూరి ఇనాక్, ఆచార్య ఎస్.గంగప్ప నుంచి డాక్టర్ వీఆర్ రాసాని,వైఎస్ సిలార్, పల్లేటి లక్ష్మీకుల శేఖర్, రాళ్లబండి శ్రీనివాస్, వైజీ ప్రకాశ్ తదితరులు కూడా పలు నాటకాలు రాసి ప్రజలను చైతన్య పరిచారన్నారు. కార్యక్రమ ప్రారంభంలో వైవీయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ డీన్ రాంప్రసాద్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఎస్.ఈశ్వర్‌రెడ్డి, తెలుగుశాఖ అధ్యాపకులు రమాదేవి, బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు భూతపురి గోపాలకృష్ణశాస్త్రి శివారెడ్డి తదితరులు వక్తను సత్కరించారు.

5న చలో పార్లమెంట్‌ను జయప్రదం చేయండి

కమలాపురం : బీజేపీ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఏప్రిల్ 5న జరిగే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనువాసులు రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కమలాపురంలో ఆయన ఇతర నాయకులతో కలసి చలో పార్లమెంటు వాల్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న మోదీ నాయకత్వంలో నడుస్తున్న బీజేపీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంభిస్తుందని మండిపడ్డారు. కార్మికులను యజమానులకు బానిసలుగా చేసే విధంగా కార్మిక చట్టాలను ప్రభుత్వం మార్పు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న జరపతలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మీదేవి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నాయకులు కుష్మావతి, ఉమాదేవి, సుబ్బలక్ష్మీ, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులపై దాడులు తగవు

– నేడు నల్లబ్యాడ్జీలతో వైద్యుల నిరసన

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాజస్థాన్ ప్రభుత్వం తీసుకొచ్చిన ఆరోగ్య హక్కు చట్టానికి సంబంధించి సరైన విధి విధానాలు లేకపోవడంపై ప్రైవేటు వైద్యులు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై పోలీసులు దాడులు చేయడాన్ని ఖండిస్తున్నామని ఐఎంఏ కడపశాఖ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఫరూఖ్, డాక్టర్ వినయ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. లోపభూయిష్ట చట్టం తెచ్చి ప్రైవేటు వైద్యశాలలను బలిపశువు చేయడం సరికాదన్నారు.ప్రభుత్వం పైవేటు వైద్యశాలలకు ఇవ్వాల్సిన అనుమతుల మంజూరులో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ ప్రజలకు ఉచిత సేవలు అందించాలని ఆదేశించడం ఎంతవరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ప్రభుత్వం ప్రైవేటు వైద్యుల హక్కులను పరిగణలోకి తీసుకుని వారితో చర్చించి సమగ్రమైన చట్టాన్ని తెచ్చే వరకు ఆరోగ్యహక్కు చట్టాన్ని నిలిపి వేయాలని కోరుతూ ఐఎంఏ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు సోమవారం దేశవ్యాప్త పిలుపులో భాగంగా కడప నగరంలోని వైద్యులు నల్లబ్యాడ్జీలతో సేవలు అందించాలని నిర్ణయించామన్నారు.

డీడీ అచ్చెన్న మృతిపై న్యాయ విచారణ జరిపించాలి

పీవీసీ వద్ద, అఖిలపక్ష పార్టీ, ప్రజా సంఘాల నిరసన

కడప అగ్రికల్చర్: కడప బహుళార్థ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్, డాక్టర్ అచ్చెన్న మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని అఖిలపక్ష పార్టీ, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ విషయమై ఆదివారం కడపలోని జిల్లా పశుసంవర్ధశాఖ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, బీసీ మహాసభ నాయకులు అవ్వారు మల్లికార్జున, బీఎస్పీ గురప్ప, ఆప్ నేత డాక్టర్ శ్రీనివాసులు, లోక్‌సత్తా కృష్ణ, జనసేన గౌస్‌బాషా, ఎంఆర్ఎఫ్ నాయకులు దస్తగిరి మాట్లాడుతూ కడప పీవీసీలో డీడీగా పనిచేస్తున్న దళిత ఉద్యోగి అచ్చెన్న అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడన్నారు. 13 రోజుల క్రితం అదృశ్యమైన అచ్చెన్న శుక్రవారం అన్నమయ్య జిల్లాలో శవమై కనిపించడం బాధాకరమన్నారు. ఈ ఘటన పలు అనుమానాలకు తావిస్తుందని ఇది ముమ్మాటికీ హత్యేనని ఆరోపించారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అంజనేయులు, ఏఐటీయూసీ నాగసుబ్బారెడ్డి, వేణుగోపాల్, బాదుల్లా, చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకలు సుబ్రమణ్యం, డీహెచ్‌పీఎస్ మునయ్య, సావంత్ సుధాకర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, సీపీఎం నగర కార్యదర్శి రామోహన్‌రెడ్డి, దస్తగిరిరెడ్డి, ఇన్సాఫ్ మొయినుద్దీన్, హుస్సేన్, పకీరప్ప తదితరులు పాల్గొన్నారు.